ప్రలోభం లేకుండా ఆత్మీయంగా సహాయపడే తాయారంటే మా కాలనీలో అందరికీ అభిమానమే. పరోపకారం మిదం శరీరం అన్నట్లుగా ఉంటుంది మా తాయారు.

మున్సిపాలిటీకి ఎన్నికలు వచ్చాయి. మా కాలనీ వార్డు లేడీ రిజర్వేషనులో పడింది. ఇక అంతా తాయారుని కౌన్సిలర్ చేద్దామని తీర్మానించుకున్నాం. కొందరు సందేహరాయుళ్లు "తాయారు కౌన్సిలర్ అయితే మనకు వెనుకట్లా సహకరిస్తుందా?" అన్న సందేహం వ్యక్తం చేశారు. తాయారుకి ఎటువంటి కల్మషం లేదని మరికొందరు సమాధానపరిచారు. కాలనీ జనం అంతా కలిసి తాయారు దగ్గరకు వెళ్లి కౌన్సిలర్‌గా నిలబడాలని కోరారు.

తాయారు నవ్వింది. "వద్దు బాబూ! నన్ను ఇలా బ్రతకనివ్వండి. మీరంతా గొప్పగొప్ప చదువులు చదువుకున్న మారాజులు. మీ అందరి అభిమానం నామీదుంటే చాలు. ఏ పదవులూ వద్దుగాక వద్దం"టూ కరాకండీగా చెప్పేసింది.

తాయారు మాకు మరింత ప్రీతిపాత్రురాలయ్యింది.

**-వి.వి.సుబ్బరాజు (కాకినాడ)**

# మార్పు

జగన్నాథంగారు మరణించే సమయానికి ఇద్దరు కొడుకులూ దగ్గరే ఉన్నారు. మంచంమీద నుండి కిందకు దింపుతున్నప్పుడు దిండు కింద ఒక కవరు కనిపించింది.

చిన్నకొడుకు అవి తీసుకుని లోపలకి వెళ్లి చూసి వచ్చి "అన్నయ్యా ఇలా ఒక్కసారి రా" అని పిలిచాడు. పెద్దకొడుకు వెళ్లి "ఏమని?" అడిగాడు. కవర్ని అన్నయ్యకు ఇచ్చాడు తమ్ముడు. ఆ కవరు విప్పి చూస్తే అందులో పదివేల రూపాయలు, ఒక చిన్న చీటి ఉంది.

"నా అంత్యక్రియల కోసం!" అని ఆ చీటీలో రాసి ఉంది.

ఇద్దరూ ఒకళ్ల మొహాలొకరు చూసుకున్నారు.

* * *

జగన్నాథరావుగారు జగమెరిగినవారు.

తనకున్న విద్వత్తుకు తగిన ఉద్యోగాలు వెదుక్కుంటూ వచ్చినా నలుగుర్ని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలన్న ఆశయంతో పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నారు. ఆ ఆదర్శంతోనే ఎంతోమందికి విద్యాదానం చేశారు. అతని వద్ద చదివిన ఎంతోమంది ఎన్నో రంగాల్లో ఉన్నతమైన పదవులలో ఉన్నారు. కృతజ్ఞతా పూర్వకంగా నేటికి ఆయనను తలుచుకుంటూంటారు.

విద్యాదానంతో పాటు ఎంతోమంది పేద విద్యార్థులకు గుప్తదానాలు చేసి చదివించారు. అడిగిన వాళ్లకు లేదనకుండా యథాశక్తి ఉపకారం చేసి మంచిని, గౌరవాన్ని సంపాదించుకున్నారు. మంచి క్రమశిక్షణ గల మనిషని పేరు తెచ్చుకున్నారు.

తన ఇద్దరి కొడుకులనీ వాళ్లు చదివినంతవరకూ చదివించేరు. పెద్ద కొడుకు పి.జి. చేసినా ఉద్యోగం దొరక్కపోయేసరికి తన అభీష్టానికి విరుద్ధమైనా కొడుకు కోసం తమ సంస్థలోనే అధికారులను అర్థించి తాను స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ఉద్యోగం ఇప్పించారు.

ఇహ రెండో కొడుకు పరీక్షల్లో పాసయినా తగిన ర్యాంక్ రాకపోవడంతో గవర్నమెంటు కాలేజీలలో సీటు రాలేదు. కొడుకు ఆసక్తి గమనించి ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో తలకు మించిన డొనేషన్ కట్టి మరీ ఇంజినీరును చేశారు.

ఈ విధంగా ఇంటాబయటా కూడా తనకుమాలిన ధర్మం నిర్వర్తించారు. తనకు ఉంటే తినేవారు అంతేగాని తన కోసం ఇతరులు కష్టపడేందుకు ఇష్టపడేవారు కాదు. 'దేహీ' అని ఎవరిని అడిగేవారు కాదు. తన విషయంలో ఏ పని అయినా ముందే ఆలోచించి కార్యాచరణ చేసేశారు.

అలాగే తన తదనంతరం కొడుకులకు భారం కాకుండా తన వద్ద ఎప్పుడూ సరిపడా ధనం ఉంచుకునే వారు. అలా జాగ్రత్త చేసినదే ఈ పదివేలు కూడా.

అన్నదమ్ములిద్దరూ ఆ డబ్బును జాగ్రత్త పెట్టి తండ్రి వద్దకు వచ్చి తరువాత జరగవలసిన కార్యక్రమం గురించి ఆలోచించారు. ఒక గంటలో ఇంటి వద్ద జరగవలసినవన్నీ జరిగిపోయాయి.

శ్మశానానికి తీసుకు వెళ్లారు. అక్కడ ఆచార ప్రకారం దహనం చేసే ఏర్పాటూ, ఇప్పటి సౌలభ్యం ప్రకారం విద్యుత్ దహన ఏర్పాటూ రెండూ ఉన్నాయి.

అక్కడకు రాగానే అన్నదమ్ములిద్దరూ సంశయంలో పడ్డారు. అయిదారు వేలు ఖర్చు పెట్టి బ్రాహ్మణుల చేత మంత్రసహితంగా, మన సంప్రదాయం ప్రకారం దహనం చేయించడమా...లేక విద్యుత్ దహనం కావించడమా అని ఆలోచించారు.

విద్యుత్ దహనం అయితే 105 రూపాయలు మాత్రమే అని అక్కడి అధికారి చెప్పేడు.

బయటకు ఏమీ కనబడదు. శవం కాలుతున్నప్పటి బీభత్సం చూడనక్కరలేదు. ఒక గంటలో లోలోపలే అంతా అయిపోతుంది. చనిపోయాక శరీరాన్ని లేకుండా చేయడమే కదా కావల్సింది. ఆ పని ఎలా చేస్తేనేం? పూర్వం ఇలాటి పద్ధతులు లేవుకాబట్టి పాత పద్ధతులే తప్పేవి కాదు.

ఇన్నాళ్లూ మనతోపాటు కలసి ఉన్న వ్యక్తి శరీరం మన ఎదురుగానే కాలిపోతూ ఉంటే కళ్లారా చూస్తూ భరించే కన్నా ఇలా అయితేనే మంచిది కదా! ప్రాణం లేని కట్టెకి ఎలా దహనం చేశారో తెలుస్తుందా? అదీకాక వేలకొద్దీ అయ్యేది. ఒక వందతో అయిపోతూ ఉంటే ఆ అనవసర ఖర్చు దండగే కదా!

ఇలా తర్జనభర్జన పడి ఆఖరికి తండ్రిని విద్యుత్ దహన వాటికలోనే దహనపర్చి వచ్చారు అన్నదమ్ములిద్దరూ.

మిగతా కార్యక్రమాలన్నీ లాంఛనప్రాయంగా, అయిదారు వందలతో అయిందనిపించి మిగిలిన సొమ్మును చెరిసగం పంచేసుకున్నారు ఇద్దరన్నదమ్ములూ!

* * *

జగన్నాథరావుగారు జీవితంలో ఎప్పుడూ ఇలా ఆలోచించి దేనికీ రాజీపడలేదు. ఎవరినీ కష్టపెట్టలేదు. చేయవలసిన పనిని తన కర్తవ్యంగా భావించి దేనిలోనూ లోభత్వం పడకుండా నిర్వర్తించేవారు. ఉన్నంతలో సంతృప్తిగా, సుఖంగా బ్రతికారు. కొడుకుల విషయంలో ఏ లోటూ చేయలేదు.

తల్లిదండ్రులకు తను చనిపోయే వరకూ తద్దినాలు పెడుతూ వారిని స్మరించుకుంటూ మాతాపితల ఋణం తీర్చుకుంటూనే ఉన్నాడు. తనకూ తన కొడుకులు అలాగే చేస్తారని ఆశించేరు కాబోలు.

అయినా జరిగింది ఏమిటి?

తనువు చాలించాక ఈ శరీరం పంచభూతాలలో కలిసిపోవాలి.

చితిమంటలలోనయితే పంచభూతాలూ తమలో కలుపుకుంటాయి. ఎలక్ట్రికల్ క్రిమేషన్‌లోనయితే ఇది జరుగుతుందా?

జగన్నాథంగారి శరీరాన్ని ఒక కృత్రిమాగ్ని కబళించింది!

అతని శరీరంగాని, భస్మంగాని నేలను తాకలేదు!

సహజమైన అగ్ని తనలో కలుపుకోలేదు!

వాయుదేవుడు అగ్నికీలల్ని రగల్చలేదు!

నీటితో చితి చల్లార్చబడలేదు!

ఆకాశం కింద దహనసంస్కారం జరగలేదు!

భూమి, ఆకాశం, వాయువు, అగ్ని, నీరు ఈ పంచభూతాలతో సంపర్కమే లేదు అతని శరీరానికి.

అయినా జగన్నాథరావుగారి ఆత్మకు శాంతి కలగాలనే ఆశిద్దాం!

**-ద్వివేదుల సోమనాథశాస్త్రి**